## క్లుప్తంగా

### మల్లన్నకు నృత్య నీరాజనం



నృత్యప్రదర్శనలో కళాకారులు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై హైదరాబాద్‌కు చెందిన అక్షయ నృత్యాలయ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకకౌత్వం, ఓం నమశివాయ, భో శంభో, శివతాండవం తదితర గీతాలకు అవని సతీష్, అపర్ణ, సుప్రీతి, అమూల్య తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

### హెడ్‌కానిస్టేబుల్ మృతికి నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

**ఆత్మకూరు:** స్థానిక పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు బీపీ పడిపోయి శుక్రవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రామాంజినాయక్ శనివారం హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జిల్లా ఎస్పీ మంజూరు చేసిన రూ.లక్ష చెక్కును మృతుడి భార్యకు డీఎస్పీ అందజేశారు. నివాళులర్పించిన వారిలో ఆత్మకూరు టౌన్, రూరల్ సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

### హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

**పాములపాడు:** ద్విచక్రవాహనదారుడు తలకు హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ సురేష్‌బాబు సూచించారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల ఎలాంటి ప్రమాదం జరిగిన ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### పాచిపట్టిన నిర్లక్ష్యం



పాచి పట్టిన మినీ ట్యాంక్

**పగిద్యాల:** పంచాయతీ అధికారుల నిర్లక్షంతో తాగునీటి ట్యాంక్ పాచి పట్టింది. పదిహేను రోజులకోసారి ట్యాంక్‌లను శుభ్రం చేయడంతో పాటు ప్రతి ఫిల్లింగ్‌ను క్లోరినేషన్ చేయాలనే నిబంధనలు పేపర్లకే పరిమితం అయ్యాయి. అందుకు నిలువెత్తు సాక్ష్యమే పడమర ప్రాతకోటలోని మినీ ట్యాంక్. ట్యాంక్‌లు లీకేజీ అవుతూ పాచిపట్టిన నీటితే ప్రజలు తాగుతున్నా పట్టించుకునే నాథుడు లేరు. ఇకనైనా మండల అధికారులు స్పందించి ట్యాంక్‌లను శుభ్రం చేయించడంతో పాటు నీటిని క్లోరినేషన్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



మార్కెట్‌యార్డు ఆవరణలో చెత్తను సేకరిస్తున్న కలెక్టర్, జేసీ

**నంద్యాల(అర్బన్):** ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మన ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డు ప్రాంగణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం అనంతరం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మార్కెట్ యార్డ్ లోని పిచ్చి మొక్కలు, చెత్త చదరాన్ని తొలగించి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న తర్వాత 'క్లీన్ మైండ్ క్లీన్ బాడీ' అనే థీమ్‌తో పాటు రెగ్యులర్ థీమ్ అయిన నీరు-మీరు కింద కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 వేల ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు చేపట్టారని, ఆయా ప్రదేశాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న తదితరులు పాల్గొన్నారు.

# బస్సులన్నీ వైజాగ్‌కే!

- అరకొర బస్సులతో ఇబ్బందులు పడిన ప్రయాణికులు

ఆత్మకూరు పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో బస్సుల కొరత ప్రయాణికులను వేధిస్తోంది. మూడు రోజుల క్రితం ఆరు బస్సు సర్వీసులను ఆత్మకూరు నుంచి యోగా కార్యక్రమానికి విశాఖపట్టణానికి పంపడంతోపాటు ప్రైవేట్ బస్సులు వివిధ కారణాల వల్ల రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. – ఆత్మకూరు



బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

ఆత్మకూరు ఏపీఎస్‌ఆర్టీసీ నుంచి ప్రతిరోజూ నంద్యాల, కర్నూలు, శ్రీశైలం, విజయవాడ, హైదరాబాద్‌కు అత్యధికంగా ప్రయాణం కొనసాగిస్తారు. ప్రధానంగా ఆత్మకూరు బస్టాండు నుంచి అత్యధికంగా పలు సర్వీసులు రాకపోకలు కొనసాగుతున్నాయి. ఊహించని విధంగా బస్సుల కొరతతో ప్రయాణికులు ఇబ్బందులు పడడమేగాకుండా గంటల తరబడి బస్టాండులో కర్నూలు, నంద్యాల, ఆత్మకూరు, శ్రీశైలం బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందన్నారు. బస్సులు ఏ సమయానికి వస్తాయో తెలియకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ప్రతి బస్సు వచ్చినప్పుడు అత్యధికంగా బస్సులో సీట్లు దొరికితే చాలంటూ ఉరుకులు, పరుగులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

**నిలబడే ప్రయాణం..**

ఆత్మకూరు నుంచి గంట రెండు గంటలకోసారి బస్సులు రావడంతో ప్రయాణికులు కిక్కిరిసి ఎక్కుతున్నారు. సీట్లు లేకపోయినా నిలబడే ప్రయాణం సాగిస్తున్నారు. గమ్య స్థానాలకు చేరాలనే ఆతృతతో కిందామీదా పడి అయినా బస్సులోకి దూరిపోతున్నారు. పిల్లాపాపలతోపాటు లగేజీతో ఉన్న ప్రయాణికులు సీట్లు లేక విసిగిపోతున్నారు. ప్రతి బస్సులో సీట్లకు మించి ఎక్కుతుండటంతో నిలబడే ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు, నంద్యాలకు సగానికి పైగా ఫేర్ బస్సులు అరకొరగా ఉండడంతో బస్సుల కొరత ఏర్పడింది. ఈ బస్సులు ఎప్పుడు నిలిచిపోతాయో తెలియని పరిస్థితిలో ప్రయాణికులు ఉన్నారు.

**68 సర్వీసుల్లో నడిచేది 50 లోపే..**

ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో 34 అద్దె బస్సులు, మరో 34 సర్వీసు బస్సులు ఉన్నాయి. అమరావతికి ఆర్టీసీ బస్సులు వెళ్లడంతో దాదాపు 10 సర్వీసులకు పైగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శ్రీశైలం వెళ్లేందుకు చాలా ప్రాంతాల నుంచి ప్రజలు ఆత్మకూరుకు చేరుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని ఆళ్లగడ్డ, నంద్యాల, ఆదోని,పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆత్మకూరుకు వచ్చి శ్రీశైలం క్షేత్రానికి ఆత్మకూరు డిపో ద్వారా ద్వారానే వెళ్తారు.కర్నూలు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

**పూర్తిస్థాయిలో బస్సులు నడపాలి**



ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి రోజూ బస్సులు రద్దు అవుతుంటాయి. వీటి స్థానంలో బస్సులు లేకపోవడంతో ఉన్న బస్సుల్లోనే ప్రజలు వెళ్లాల్సిన పరిస్థితి. వచ్చిన బస్సుల్లోనే వెళ్లాలంటే స్టాండింగ్ తప్పని పరిస్థితి. ఇలా నిలిచి దోర్నాల, శ్రీశైలానికి వెళ్లాలంటే ప్రయాణికులు తప్పని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బస్సు సర్వీసులు అన్నీ నడిచేలా చూడాలి. – సురేష్, ఆత్మకూరు

**సమయానికి బస్సులు నడపాలి**



సమయానికి బస్సు సర్వీసులను నడపాలి. అలా నడిపితే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఒక్కోసారి బస్సులు వెంటవెంటే వస్తుంటాయి. ఒక్కోసారి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే డ్రైవర్లు సమయపాలన పాటించడం లేదనిపిస్తుంది. – రమణారెడ్డి, కృష్ణాపురం

### రిక్వెస్టు బస్టాప్ ఏర్పాటుకు పరిశీలన

**జూపాడుబంగ్లా:** రిక్వెస్టు బస్టాప్ ఏర్పాటుకు ఆర్టీసీ ఆత్మకూరు డిపో మేనేజర్ వినయ్‌కుమార్ పరిశీలించారు. స్థానిక కేజీ రోడ్డుపై ఉన్న ఐలమ్మ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు శనివారం ఆయన కంట్రోలర్ మహమ్మద్ మోమిన్‌బాషాతో కలిసి జూపాడుబంగ్లాకు చేరుకొని పరిశీలించారు. ఐలమ్మ, అంబేడ్కర్ విగ్రహాలున్న ప్రాంతంలో రిక్వెస్టు బస్టాప్ ఏర్పాటు చేయడం వల్ల బ్యాంకు సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు, జూపాడుబంగ్లా, కాసానగర్ కాలనీలవాసులకు ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు ఆయనకు విన్నవించడంతో సానుకూలంగా స్పందించారు.

### సద్వినియోగం చేసుకోండి

**నంద్యాల(వ్యవసాయం):** ఈ నెల 26వ తేదీన నిర్వహించే దివ్యంగుల ఉపకారణాల ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. 26న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మున్సిపల్ టౌన్‌హాల్‌లో దివ్యాంగులు, వృద్ధులను పరీక్షించి వారికి అవసరమైన వారికి బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిళ్లు, చక్రాల కుర్చీలు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, అంధుల చేతి కర్రలు ఉచితంగా అందించడానికి ఎంపిక చేస్తారన్నారు. సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, వికలత్వం కనిపించే ఫోటోలు మూడు, స్వావలంబన కార్డులు తీసుకు రావాలని సూచించారు.

## రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా



పోస్టర్‌లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ యూత్, విద్యార్థి సంఘాల నాయకులు

**ఆత్మకూరు:** తప్పుడు హామీలతో అధికారం చేపట్టి ఏడాదైనా అమలు చేయకుండా నిరుద్యోగులను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈనెల 23న జిల్లా కలెక్టరేట్ ఎదుట యువత పోరు పేరుతో ధర్నా నిర్వహించనునట్లు వైఎస్సార్ సీపీ యూత్ సెక్రటరీ విజయ్‌చౌదరి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు రియాజ్‌బాషా, మండల అధ్యక్షులు ధనుంజయ, కార్యదర్శి మహబూబ్ బాషా, పార్టీ మండల, మహిళా సంఘం అధ్యక్షులు సయ్యద్‌మీర్ రాజమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో యువత పోరు కార్యక్రమ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగభృతి చెల్లిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల చొప్పున యేడాదికి రూ.36 వేలు చెల్లించాలన్నారు. నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించి అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఈనెల 23న నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ధర్నాలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటస్వామిగౌడ్, డాక్టర్ ఈశ్వరసాయి, సిద్ధార్థరెడ్డి, నాగరాజు, రఫిక్, తేరుబాషా, జావిద్, నాగరాజు, సుల్తాన్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

## అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు



వ్యాపారులకు సూచనలిస్తున్న ఈఓ ఎన్.శ్రీనివాసరెడ్డి

**మహానంది:** ఆలయ పరిధిలో షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులు వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శనివారం దేవస్థానం కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు భక్తుల నుంచి ఫిర్యాదులొస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ కప్పులు, ఫైబర్ కప్పులు వాడరాదని, గాజు గ్లాసులు మాత్రమే వాడాలన్నారు. షాపుల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, ధరల వివరాల బోర్డులను మూడు రోజుల్లోపు ఏర్పాటు చేయకపోతే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ప్రతి నెలా కార్యాలయం వద్దకు వచ్చి అద్దెలు చెల్లించాలన్నారు. సమావేశంలో ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ నీలకంఠరాజు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేద్దాం



స్టిక్కర్లను విడుదల చేస్తున్న నాయకులు

**ఆత్మకూరు:** జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహ నాయక్, స్వాములు కోరారు. శనివారం సమ్మెకు సంబంధించిన స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కేంద్రం ప్రభుత్వం నీరుగార్చడం తగదన్నారు. పారిశ్రామికవేత్తలకు కార్మికులను కట్టుబానిసల్లా చేయడమే బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాబాషా, రామ్‌నాయక్, అలక్కీరాజు తదితరులు పాల్గొన్నారు.

### పొంచివున్న ప్రమాదం



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న పైప్‌లైన్ గుంత

పగిద్యాల మండల పరిధిలోని నెహ్రూనగర్ ఆంజనేయస్వామి ఆలయ ప్రధాన రహదారి పక్కన తవ్విన పైప్‌లైన్ గుంతతో ప్రమాదం పొంచివుంది. గంగపుత్ర కాలనీవాసులకు తాగునీటిని అందించేందుకు జీపీ పైప్‌లైన్ వేసి మినీ ట్యాంక్‌లకు అనుసంధానం చేశారు. జీపీ పైప్‌లైన్‌కు నీటి సరఫరా చేసేందుకు మెయిన్ పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చేందుకు దాదాపు పదిహేను రోజుల క్రితం గుంతను తవ్వారు. రోడ్డు పక్కన తవ్విన గుంతను పూడ్చకపోవడంతో పాదాచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయించి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. – పగిద్యాల

## ప్రజా సమస్యలపై పోరాడుదాం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

**కొత్తపల్లి:** ప్రజా సమస్యలపై పోరాటానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. రంగనాయుడు కోరారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు మహాసభలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పక్కా గృహం, ఇంటి స్థలం, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ పథకాలను గాలికొదిలేసిందన్నారు. ఖరీఫ్ ప్రారంభమైనా ఇంత వరకు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించకపోవడం బాధాకరమన్నారు. అనంతరం ప్రజా సమస్యలపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేతం వెంకటశివుడు, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన కమిటీ

**వెలుగోడు:** ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ గుంతకందాల గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధికార ప్రతినిధి బాషాపోగుల దరగయ్య మాదిగ తెలిపారు. శనివారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వాదం నాగేషులు మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎస్పీ గ్రామ అధ్యక్షుడిగా కడతల భాస్కర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడిగా మంద మధు మాదిగ, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా ఇందిరమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో మండలం ఇన్‌చార్జ్ బి.ఆరోగ్యం పాల్గొన్నారు.

### ఎంటీఎస్ టీచర్లకు నేడు కౌన్సెలింగ్

**కర్నూలు సిటీ:** ప్రభుత్వ పాఠశాలల్లో మినిమం టైం స్కేల్(ఎంటీఎస్)పై పని చేస్తున్న 1998, 2008 డీఎస్సీ ఎస్‌జీటీలకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష కార్యాలయం సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎంటీఎస్ టీచర్ల జాబితాలను డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టామని డీఈఓ పేర్కొన్నారు.

### రూ.6 కోట్లతో సీ క్యాంపు రైతుబజారు విస్తరణ

**కర్నూలు(అగ్రికల్చర్):** నగరంలోని సి.క్యాంపు రైతుబ బజారును రూ.6 కోట్లతో విస్తరించనున్నారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. 110 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పులో విస్తరించడానికి మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. అండర్ గ్రౌండ్‌లో పార్కింగ్ సదుపాయం కూడా ఉంటుంది. 130 షెడ్లు, 60 షాపులు ఉంటాయని అధికార వర్గాలు తెలిపాయి.

### ఒడిశా వాసి ఆత్మహత్య

**కర్నూలు:** ఉపాధి నిమిత్తం వలస వచ్చి కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నివాసముంటున్న ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ గ్రామానికి చెందిన సుశాంత్ కుమార్ దాలియా (36) చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన స్థానిక జీఎస్ ప్లాస్టిక్ రీ సైక్లింగ్ ఫ్యాక్టరీలో నాలుగేళ్లుగా పనిచేస్తున్నాడు. ఒంటరిగా ఉంటున్న ఈయన శుక్రవారం రాత్రి భార్య మున్నీకి ఫోన్ చేశాడు. మాటల సందర్భంలో ఆమెతో గొడవ పడి క్షణికావేశంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## యువత పోరును విజయవంతం చేయండి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న మాధురి, నాయకులు

**నందికొట్కూరు:** యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం మెడలు వంచి సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం యువత పోరును విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధురి, యూత్ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు ఇదాయతుల్లా(లడ్డు) కోరారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే యువత పోరు కార్యక్రమం వాల్ పోస్టర్లను శనివారం పట్టణంలోని నయార పెట్రోల్ బంకు వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని సీఎం చంద్రబాబు నాయుడు మోసం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఏడాదైనా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ఈనెల 23న కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే యువత పోరు కార్యక్రమానికి నిరుద్యోగులు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, ఆయా విభాగాల నాయకుల బాషా, సమీవుల్లా, భార్గవ్, అబ్దుల్లా, జావీద్, కేశవ, యూనాస్. చరణ్, కరిముల్లా, మిట్టు, అబ్దుల్లా, కర్రి, శంకర్, హరి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడాలి

- జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు



చిన్నవంగలిలో ఉద్యాన రైతులతో సమావేశం నిర్వహిస్తున్న ఉద్యానశాఖాధికారులు

సాక్షి ఎఫెక్ట్

**ఆళ్లగడ్డ:** ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు సంఘాలుగా ఏర్పడితే నేరుగా మార్కెట్ వారితో అనుసంధానం చేసుకోవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు సూచించారు. జిల్లాలో దళారి వ్యవస్థ.. ఉద్యాన పంటల మార్కెట్‌ను శాసిస్తోందనే విషయాన్ని 'సాక్షి' శుక్రవారం 'దళారుల పంట పండుతోంది' శీర్షికన ప్రచురించిన కథనానికి జిల్లా ఉద్యానశాఖాధికారులు స్పందించారు. శనివారం చాగలమర్రి మండలంలోని పలుగ్రామాల్లో సంచరించి రైతులతో మమేకమయ్యారు. అనంతరం చిన్నవంగళి గ్రామంలో ఉద్యాన పంటల సాగుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దళారి వ్యవస్థ, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే గ్రామం కాని, రెండు మూడు గ్రామాల్లోని రైతులు కానీ కలిసి ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడేందుకు ముందుకు రావాలన్నారు. తద్వారా రైతులే నేరుగా మార్కెట్ వారితో మాట్లాడుకుంటూ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా దళారీ వ్యవస్థను పూర్తిగా అడ్డుకోవచ్చన్నారు. ఈ సంఘాలకు గోడౌన్ లను నిర్మించుకునేందుకు రాయితీ సౌకర్యంకూడా పొందవచ్చన్నారు. అక్కడే గ్రేడింగ్ చేసుకొని, నిల్వ చేసుకోవచ్చన్నారు. ధర లేనప్పుడు కొన్ని రకాల ఉత్పత్తులను పౌడర్ చేయడం, జూస్‌గా చేయడం, డ్రై చేసేందుకు అవసరమైన స్టీం చేయడం తదితర ఉప ఉత్పత్తులను తయారు చేసుకునే విధంగా అవసరమైన యంత్రాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు చెప్పారు. ఈయన వెంట ఉద్యానశాఖ అధికారులు శ్రీధర్, దస్తగిరి ఉన్నారు.

## పోలీసు లాంఛనాలతో హెచ్‌సీ అంత్యక్రియలు

**కర్నూలు:** మూర్ఛ వ్యాధికి గురై కొన్ని నెలలుగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందిన ఆత్మకూరు పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు భౌతిక కాయానికి శనివారం కల్లూరు శ్మశాన వాటికలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మిడుతూరు ఎస్‌ఐ ఓబులేసు, పోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగరాజుతోపాటు కుటుంబ సభ్యులు, సహోద్యోగులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉంటే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కళ్లను కుమారుడు సందీప్, కుటుంబ సభ్యులు మూర్తి కలిసి కర్నూలు ఐ-బ్యాంక్‌కు దానం చేశారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో యోగాసనాలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా శిక్షకులు యోగా లాభాలను వివరించారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. యోగాసనాల వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత సమకూరుతుందన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరులో యోగాసనాలు వేస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్, ఇతర అధికారులు



నందికొట్కూరు కోర్టు ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమంలో జడ్జి, న్యాయవాదులు, సిబ్బంది

- ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్డీఓ నాగజ్యోతి, డీఎస్పీ కార్యాలయాల్లో డీఎస్పీ రామంజినాయక్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొట్టాల చెరువు సచివాలయం వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఎంపీడీఓ నాగభూషనంశెట్టి పాల్గొన్నారు. శ్రీశైలంప్రాజెక్ట్ సున్నిపెంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐటీడీపీ పీఓ కె.వి.శివకుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.పి.హుస్సేబాషా, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న, ఐటీఐలో ప్రిన్సిపాల్ ఏ.రవీంద్ర, వెలుగోడులో స్పెషల్ ఆఫీసర్, నంద్యాల డీఎఫ్ఓ నాగమల్లేశ్వరి, బండి ఆత్మకూరులో ఎంపీడీఓ దస్తగిరి, మహానంది వ్యవసాయ కళాశాల ఆవరణలో అసోసియేట్ డీన్ డాక్టర్ వి. జయలక్ష్మి ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.
- శ్రీశైలంలో ఈఓ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఒంగోలుకు చెందిన యోగా శిక్షకులు, యోగాచార్య, గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు.
- నందికొట్కూరులోని మార్కెట్ యార్డులో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. సబ్ జైల్, కోర్టు ఆవరణల్లో సీనియర్ సివిల్ జడ్జి శోభరాణి ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పగిద్యాలలో ప్రత్యేక అధికారి, సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ నాగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ సుమిత్రమ్మ పాల్గొన్నారు. కొత్తపల్లిలో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరీ, పాములపాడులో మండల ప్రత్యేకాధికారి రాజు ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో యోగాసనాలు వేస్తున్న డీఎస్పీ, సీఐలు, పోలీసులు



నందికొట్కూరు మార్కెట్ యార్డులో యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



శ్రీశైలంలో జ్యోతిప్రజ్వలన చేసి యోగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఈఓ